క్లుప్తంగా

మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో జీర్ణోద్ధరణ గావించారు. మొదటి రోజు ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో మాతృకాపూజ, పంచగవ్యమేళన, ప్రోక్షణ, ప్రాశనము, రక్షా బంధనం, ప్రదోషకాలపూజ, దీక్షా హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మొబైల్ ఆధార్ సెంటర్ తనిఖీ



విద్యార్థికి ఆధార్ అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్‌లో రెండోరోజు బుధవారం ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ సుబ్బరాజు తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 5నుంచి 15 ఏళ్ల పైబడిని విద్యార్థులకు బయోమెట్రిక్ చేయించాలని ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. కొత్తగా ఆధార్ నమోదుతో పాటు పేర్లు, ఇతర వివరాల మార్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి ,పంచాయతీ సెక్రటరీలు భాస్కర్‌రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గృహ సారథులతో ఎమ్మెల్యే సమీక్ష

అవుకు: మండల కేంద్రం అవుకులోని సీబీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో ఈ నెల 10వ తేదీన సచివాలయ కన్వీనర్లు, గృసారథులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా కుటుంబ సభ్యులు, జిల్లా అబ్జర్వర్ అమర్‌నాథ్ రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ అఫ్జల్‌ఖాన్ హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి వన్నూరువలి స్వామి ఉరుసు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లెలో వెలసిన వన్నూరువలిస్వామి ఉరుసు గురువారం గంధంతో ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యుడు ముల్లావన్నూర్‌బాషా తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని, భక్తులు తరలి వచ్చి స్వామివారి దీవెలనలు పొందాలన్నారు.

ధోబీ ఘాట్‌లను నిర్మించండి

డోన్: పట్టణ ప్రజల బట్టలు శుభ్రం చేసేందుకు ధోబీఘాట్‌లు నిర్మించాలని రజక ఐక్యసేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు కోరారు. మేరకు బుధవారం స్థానిక రజక సంఘం నాయకులతో కలిసి ఆయన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. పట్టణ జనాభాకు అనుగుణంగా ఆధునిక ధోబీ ఘాట్‌లను నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ధోబీ ఘాట్‌లలో కనీస సౌకర్యాలు లేక రజకులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన చైర్మన్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, శ్రీరాములు, అయ్యన్న, ఈశ్వరయ్య, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్య వేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా బాల రామగోవిందు



అవుకు: జాతీయ చేనేత ఐక్య వేదిక బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన బాలరామ గోవిందు ఎంపికయ్యారు. జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని బాలరామ గోవిందు తెలిపారు. చేనేతల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

డోన్ టౌన్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బుధవారం డోన్ పర్యటనకు వచ్చిన ఆయన పట్టభద్రులను కలిసి బీజేపీ బలపరస్తున్న నగరును రాఘవేంద్రను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుడ్డా శ్రీకాంతరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు హేమ సుందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సందు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

- ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- వార్డెన్ తీరుపై మండిపాటు



విద్యార్థినులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: విద్యాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తుందని, అయితే కొందరు అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు. రూ. కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు సకల మౌలిక వసతులు కల్పిస్తుందని, అయితే కొందరి నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందంటే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డెన్ సెలవులో ఉండడంతో విద్యార్థినులు పెద్దఎత్తున సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. భోజనం సరిగా ఉండడం లేదని... నీటి వసతి కూడా లేదని.. స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు ఎమ్మెల్యే ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. వార్డెన్ తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఉన్నధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులు ఇంత ఇబ్బందులు పడుతుంటే పర్యవేక్షణ అధికారులు ఏమి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి ఏ సమస్య తలెత్తకుండా చూసుకుంటానని, ఆందోళన చెందకుండా బాగా చదువుకోవాలని ఎమ్మెల్యే కాటసాని విద్యార్థినులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి హాస్టల్‌ను తనిఖీ చేస్తామని, వార్డెన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని హెచ్చరించారు.

హాస్టల్‌నుసందర్శించిన ఎంపీడీఓ,ఎస్‌డబ్ల్యూఓ

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శివరామయ్య, ఏఎస్‌డబ్ల్యూఓ దిల్‌బాషా బుధవారం రాత్రి సందర్శించారు. భోజన సమయంలో వెళ్లిన వారికి విద్యార్థినుల నుంచి ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. రాత్రి సమయంలో వండిన అన్నం తినేందుకు వీలు లేకుండా మెత్తగా ఉండగా నీళ్ల మజ్జిగ, నీళ్లుగా ఉన్న కర్రీ బయటపడ్డాయి. ప్రతి రోజు వండే అన్నం చాలదని, కర్రీ ఉండదని, చాలీచాలని మజ్జిగే శరణ్యమని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో హాస్టల్ భోజన సదుపాయం ఉండదని, పట్టణంలోని గరిమిరెడ్డి అచ్చమ్మ మఠం, వీరబ్రహ్మేంద్రస్వామిమఠం వద్ద ఉన్న అన్నదాన సత్రానికి మధ్యాహ్న సమయంలో పంపిస్తున్నారని విద్యార్థినులు తెలిపారు. అన్నదాన సత్ర నిర్వాహకుల విమర్శలకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృతజ్ఞతలు

బనగానపల్లెరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లోని పాలక మండలి సభ్యుల నియామకంలో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీవో విడుదల చేయడంపై పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కాట సాని రామిరెడ్డిని స్థానిక స్వగృహంలో నాయకులు కలిసి పూలమాలలు వేసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నాయీ బ్రాహ్మణులను చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10వేల అందించి ఆర్థికంగా ఆదుకుంటున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. అలాగే నాయీ బ్రాహ్మణులు దేవాలయాల్లో ఎన్నో ఏళ్ల నుంచి పలు రకాలుగా సేవలందించడం జరుగుతుందని, వారిని మరింత అభివృద్ధి పరచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 610 హిందూ ఆలయాల్లోని పాలక మండళ్లలో తగిన గుర్తింపు ఇచ్చే విధంగా ప్రభుత్వం జీవోను విడుదల చేయడం హర్షించతగిన విషయమన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాము, నాగేష్, మద్దిలేటి, కార్తీక్, సుమంత్, నాగేశ్వరావు, రామ్మోహన్, మధు, సురేష్, జయన్న, మధుమోహన్, మహేంద్ర, శేఖర్,వార్డు మెంబరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సుల ప్రారంభం



కొత్త బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోకు నూతనంగా మంజూరైన రెండు ఎయిర్‌విత్ బస్సులను బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. కోవెలకుంట్ల- తాడిపత్రి రహదారిలో రెండు కొత్త బస్ సర్వీసులు ఏర్పాటు చేశారు. బస్ నడిపి సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన ప్రయాణికులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల అధ్యక్షుడు కాట సాని తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, నాయకులు చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, శ్రీనివాసనాయక్, బూసభాస్కర్‌రెడ్డి, డిపో మేనేజర్ తిరుపతయ్య, యూనియన్ నాయకులు శివరాం, గిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర

బనగానపల్లెరూరల్: మండలంలోని మీరాపురం గ్రామంలో గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో శ్రీ పెద్దమమ్మ దేవర ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి గ్రామంలో నడిబొడ్డున ఏర్పాటు చేసిన మండపంలో శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహాన్ని అందంగా ముస్తాబు చేసి, సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, పారిశ్రామికవేత్త శనివారపు వెంకట్రామిరెడ్డి తదితరులు పెద్దమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

స్వామివివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి



బార్ అసోషియేషన్ మద్దతు కోరుతున్న నాయకులు

డోన్ టౌన్: దేశ గౌరవాన్ని చాటిన స్వామివివేకానంద విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందజేయాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్ మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని క్లాత్ మర్చెంట్, జిరాక్స్ కేంద్రాలు, హోటల్స్, ఫొటో గ్రాఫర్స్, పింటింగ్ ప్రెస్ ఓనర్స్, బార్ అసోషియేషన్‌ల సభ్యులను కలిసి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకారం అందజేయాలని కోరారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సెబ్ సీఐ శ్రీనివాసులు

కోవెలకుంట్ల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కోవెలకుంట్ల సీఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం , అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మత్తు పదార్థాలను ఏ రూపంలో తీసుకున్నా ఆరోగ్యానికి హానికరమన్నారు. దురువ్యసనాలకు దూరంగా ఉండి ప్రణాళికా బద్ధంగా చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌నాయక్, నవీన్, నాగేశ్వర రెడ్డి, రాజశేఖర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిడ్జితోపాటు బ్యారేజీ నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన తీగల వంతెన స్థానంలో బ్రిడ్జితోపాటు బ్యారేజీ ఏర్పాటు చేయాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం కోవెలకుంట్లలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 167వ జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వం తీగలవంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగునీరు పుష్కలంగా అందాలంటే తీగల వంతెన స్థానంలో బ్రిడ్జితోపాటు బ్యారేజీని నిర్మించడం శ్రేయస్కరమన్నారు. వంద సంవత్సరాల క్రితం శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం కృష్ణా- పెన్నార్ ప్రాజెక్టు నిర్మించాల్సి ఉండగా కుట్రపూరిత రాజకీయాలతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదన్నారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల నీటిమట్టం ఉంటేనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందుతుందన్నారు. దిగువ ప్రాంతాల్లో ఎక్కువ సామర్థ్యం రిజర్వాయర్లు లేకపోవడంతో ప్రతి ఏటా 500 నుంచి వెయ్యి టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తోందన్నారు. బ్రిడ్జితోపాటు బ్యారేజీని ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకుంటే రాయలసీమ ప్రాంతానికి నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు.

బడి బయట పిల్లలు చదువుకునేలా చర్యలు



ఎంఆర్‌సీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న రామ్‌మోహన్ రెడ్డి

బేతంచెర్ల: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారు చదువుకునేందుకు నాన్ రెసిడెన్సియల్ స్పెషల్ ట్రెనింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్టీసీ), రెసిడెన్సియల్ స్పెషల్ ట్రెనింగ్ సెంటర్స్ (ఆర్‌ఎస్టీసీ) ఏర్పాటు చేయాలని ఎంఐఎస్ ప్లానింగ్ కోర్డినేటర్ రామ్ మోహన్ రెడ్డి ఎంఈఓ సోమశేఖర్‌కు సూచించారు. బుధవారం మండలంలోని సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ హైస్కూలు, భవిత కేంద్రం, ఎమ్మార్సీ కార్యాలయం, సుమేధా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్నే విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేయాలన్నారు. భవిత సెంటర్ ఫిజియో థెరపీ సేవలు విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం సాంకేతిక విధానంలో విద్యను బోధించేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేసిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్ద పీట



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ పథకాలను అమలు చేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా తెలిపారు. బుధవారం పట్టణంలోని 2, 5, 6 వార్డులో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి చైర్మన్ ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఈ మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు చైర్మన్ అందజేశారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని ఆయా కాలనీల ప్రజలు చైర్మన్‌కు విన్నవించారు.అనంతరం చలంరెడ్డి మాట్లాడుతూ దశల వారీగా పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేస్తామని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, షేక్ ముబీనా, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నాగేశ్వరరావు, సలీమ్, ఖాజా, డక్కి శేఖర్, రామనాయుడు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 45 కోట్లు

బేతంచెర్ల పట్టణంలోని 20 వార్డులో తాగునీటి సమస్య పరిస్కారానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో అమృత 2.0 పథకం కింద రూ.45 కోట్ల నిధులు మంజూరైనట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. ఆయా కాలనీల్లో 5 నుంచి 8లక్షల లీటర్ల కేపాసీటీతో నిర్మించే ఏడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి స్థల ప్రతిపాదనలు పూర్తి చేశారు. ఈ మేరకు బుధవారం అనంతపురం జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డి, కర్నూలు ఈఈ చంద్రమోహన్‌రావు ఆయా స్థలాలను పరిశీలించారు. స్థలాలు అప్పగిస్తే టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామని వారు తెలిపారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన మిద్దె మద్దిలేటి అవుకు మండలంలో వైకేపీ సీసీగా విధులు నిర్వర్తిస్తూ బుధవారం మృతి చెందడంతో పలువురు సంతాపం తెలిపారు. వైకేపీ నంద్యాల జిల్లా డీపీఎం శ్రీనివాసులు, బేతంచెర్ల, అవుకు మండలాల ఏపీఎంలు లింగమయ్య గౌడు, విజయ గోపాలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సీసీలు సూరిబాబు, జయన్న, మహేశ్వరీ, వెంకటేశ్వర్లు మద్దిలేటి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని భార్య రాములమ్మకు ఎంఎంఎస్ తరపున రూ. 25 వేలు, వైకేపీసీసీల తరపున రూ. 35 వేలు అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి

కొలిమిగుండ్ల: బనగానపల్లె ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కొలిమిగుండ్లకు చెందిన పిడతల కంబగిరి(54) బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. ఈయన కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. కుటుంబ సభ్యులు పది రోజుల క్రితం మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆర్టీసీ డీఎం రవికిషోర్, నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీ వీడీ వైఎస్సార్‌సీపీలో చేరిక



గుండం నాగేశ్వరరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రజకులు

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరుకు చెందిన పలువురు రజకులు టీడీపీని వీడీ బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుండం నాగేశ్వరరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో పార్టీలో చేరిన వారిలో చాకలి నాగేంద్ర,చాకలి నాగేశం, బాలసుబ్బయ్య, సురేంద్ర, సురేష్, వుశేని, గుండుపాపల మద్దిలేటి, సుబ్బరాయుడు, రామాంజనేయులు, చాకలి మధు మరి కొందరు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు అమ్మ ఒడి, చేదోడు, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతుభరోసా, సున్నా వడ్డీ తదితర సంక్షేమ పథకాలు నచ్చి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు అందజేట ఇన్నర్వీల్‌క్లబ్ సభ్యులు

డోన్ : స్థానిక మోడల్ స్కూల్ కబడ్డీ జట్టు విద్యార్థులకు బుధవారం రాయలసీమ యూనివర్సిటీ క్లస్టర్ ఈసీ మెంబర్, న్యాయవాది నాగభూషణంరెడ్డి, ముడియాల శైలజ, మాకం విద్యాశంకర్, రామసుబ్బమ్మ సహకారంతో క్రీడా దుస్తులుఎ పంపిణీ చేశారు. క్రీడాకారులను ఇన్నర్వీల్‌క్లబ్ ప్రోత్సహిస్తుందని క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టీసీ శాంతి, కార్యదర్శి శైలజ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శకుంతల, అనురాధ, ప్రిన్సిపాల్ నాగజాస్మిన్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



బియ్యం బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుసేన్

బేతంచెర్ల: కిరాణా, చౌక దుకాణాల్లో తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డోన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుసేన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో కిరాణం , బియ్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రెండు దుకాణాల్లో తేడా ఉండడంతో కేసులు నమోదు చేసి రూ.15 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

జేఈఈలో ప్యాపిలి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చాటుకున్నారు. ఎంపీసీ విద్యార్థులు రాజేశ్ 72.57, సాయిరమ్య 57.71 పర్సంటైల్ సాధించారు. ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండా స్థానికంగా కళాశాల లెక్చరర్ల సలహాలతో చదివి విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించడంపై ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల లెక్చరర్లు, సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.



కొండముచ్చు పట్టివేతకు వల వేసిన దృశ్యం



మత్తు ఆహార పదార్థాలను కొండముచ్చులకు అందజేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

దిగమంటే... దిగం!

- చెట్టెక్కి కూర్చున్న కొండముచ్చులు
- వాటిని పట్టుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించని వైనం
- గన్ ద్వారా మత్తు ఇచ్చేందుకు ఉన్నతాధికారుల అనుమతికి విన్నవం



డ్రమ్స్ ద్వారా బయటకు రప్పించే ప్రయత్న దృశ్యం

డోన్: ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జనజీవనానికి అంతరాయం కలిగిస్తున్న కొండముచ్చులను పట్టుకునేందుకు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు అధికారుల బృందం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ మేరకు బుధవారం కోర్టు, పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కొండముచ్చులను బంధించేందుకు వలలు ఏర్పాటు చేసినా ప్రయోజనం కలుగలేదు. చెట్టెక్కి కూర్చున్న వాటిని దింపేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు వర్ణనాతీతం. కొంత మంది సూచనల మేరకు బ్యాండ్ మేళాలు తెప్పించి నంద్యాల ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. వాటికి మత్తుతో కూడిన ఆహార పదార్థాలను అందించేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అధికారుల వ్యూహాలను గుర్తించినట్టు చెట్టెక్కి కూర్చున్న కొండముచ్చులు దిగమంటే.. దిగం అనేలా వ్యవహరించాయి. గన్ ద్వారా కొండముచ్చులకు మత్తుమందు ఇవ్వడం మినహా మరో మార్గం లేదని బృందంలోని అటవీశాఖ వైద్యులు వెస్లీ, జుబేర్ తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతి కోరుతున్నట్లు వారు చెప్పారు. అయితే ఒక్క కొండముచ్చు ఈ ప్రాంతంలో సంచరిస్తుందని మొదట భావించిన అటవీ శాఖ అధికారులు మొత్తం ఆరు సంచరిస్తున్నట్లు నిర్ధారించారు.